
ప్రజాశక్తి
ఆదివారం 23 ఫిబ్రవరి 2025 5 విజయనగరం



రైతు ఆత్మహత్యాయత్నంపై విచారణ

ఆర్‌డిఒకు కలెక్టర్ అంబేద్కర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

నెల్లిమర్ల మండలం చనుమల్లు పేట గ్రామానికి చెందిన చనుమల్లు అబద్దం అనే రైతు మ్యుటేషన్ కోసం రెవిన్యూ అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారని, శుక్రవారం నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు వచ్చిన వార్తల పై జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందించారు. విజయనగరం ఆర్‌డిఒ కీర్తిని విచారణా అధికారిగా నియమించి సంఘటన పై సమగ్రంగా విచారణ జరిపి నివేదికను అందించాలని ఆదేశించారు. నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

- మద్దతుధర మిథ్యేనా?
- కిలో వంగ రూ.5 టమాటో రూ.3
- కూలీల ఖర్చులు కూడా దక్కడం లేదని రైతులు దిగాలు



రామభద్రపురం మార్కెట్‌కు కూరగాయలు తీసుకొచ్చిన రైతులు

రైతులకు ధరాఘాతం

అతివృష్టి, అనావృష్టి వంటి అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకొని కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతన్న, ధరాఘాతం దెబ్బకు విలవిలలాడే పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం గొప్పగా చెబుతున్న మద్దతు ధర.. కూరగాయలకు మిథ్యేనా? అనే సందేహంతో రైతన్నలు సతమతమవుతున్నారు. గత కొద్ది రోజులుగా వంగ, టమాటో వంటి వాటికి కనీస కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూరగాయలను పొలాల్లోనే పశు వుల మేతకు ఉంచేసే దుస్థితి దాపురించింది.

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురం మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాలైన ఆరికతోట, బూసాయవలస, నాయుడువలస, కొట శిర్లాం, మామిడివలస, కొండ కెంగువ, తారాపురం, మిర్తి వలస, తదితర గ్రామాల్లో కూరగాయలు ఎక్కువగా సాగవుతుంటాయి. ఇక్కడి రైతులు వంగ, టమాటో, బీర, మునగ, దొండ, బెండ, కాకర, చిక్కుడు, ముల్లంగి, క్యాబేజీ వంటి పంటలు సాగుచేస్తున్నారు. ఆ గ్రామాల్లో పాటు బాడంగి, దత్తిరాజేరు మండలాల నుంచి కూడా కూరగాయలను రైతులు రామభద్రపురం మార్కెట్‌కు తీసుకొస్తుంటారు. వివిధ వాహన సదుపాయాల ద్వారా దశాబ్దాలుగా కూరగాయలు తీసుకొచ్చి, విక్రయిస్తుంటారు. మార్కెట్లో డిమాండ్ తక్కువ, సరఫరా ఎక్కువ అనే పేరుతో దళారులు అతి తక్కువ ధర నిర్ణయించి, కూరగాయల రైతుల శ్రమను దోచుకుంటున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌గా పేరొందిన రామభద్రపురం కూరగాయల మార్కెట్లో శనివారం టమాటో కేట్ (30 కిలోలు) కేవలం రూ.90 నుంచి 130 పలికింది. కేట్ వంగ రూ.150 వరకు ధర వచ్చింది. బయటి మార్కెట్లో వినియోగదారులకు కిలో టమాటో రూ.12 నుంచి 20, వంగ రూ.20 నుంచి 30 వరకు విక్రయిస్తున్నారు. ఎకరా సాగు కోసం టమాటోకు సుమారు రూ.30 వేలు, వంగకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. అయితే వీటిని విడతల వారీగా ఏరి మార్కెట్‌కు తరలించడానికి సుమారు రూ.5 వేల వరకు ఖర్చులు ఉంటాయి. ప్రస్తుతం మార్కెట్ ధరతో పోలిస్తే, కనీసం కూలీ ఖర్చులు కూడా రావని రైతులు దిగాలు చెందుతున్నారు.

వంగ ధర.. బెంగ తెప్పిస్తోంది



ఈ ఏడాది విరగ కాసిన వంగ పంట చూసి పాత అప్పులు తీరుతాయని అనుకున్నాం. కానీ ఇప్పుడు అమాంతం ధరలు పడిపోవడంతో దీనికోసం పెట్టిన పెట్టుబడులకు కొత్త అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. పంటలు దాచుకునేందుకు వీలుగా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి.

- మామిడి శివయ్య, వంగ రైతు, రామభద్రపురం

వివాహాల సీజన్ అయినా..

ప్రస్తుతం శుభ ముహూర్తాల సీజన్ నడుస్తున్నా కూరగాయల ధరలు అమాంతం తగ్గడంతో రైతు దిగాలు చెందుతున్నారు. వేలకు వేలు మదుపులు పెట్టి, నారు నుంచి కాయ వరకు అనేక సంరక్షణ పద్ధతుల ద్వారా పెంచి పోషించిన పంటలు తమ ఇంట రాబడి సిరులు కురిపించేలా చేస్తాయని ఆశించారు. కానీ, గిట్టుబాటు కాక, పెట్టిన పెట్టుబడులు కూడా దక్కని స్థితిలో ఆదుకునేవారు లేక పోక చెక్కల నలిగే పరిస్థితి దాపురించిందని రైతులు ఉసూరుమంటున్నారు. ప్రభుత్వం కూర గాయ పంటలకు మద్దతు ధరలు ప్రకటిం చాలని, శీతల గిడ్డంగి సదుపాయాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

టమాటో ధర లేక నష్టాలు



ఈ ఏడాది సుమారు 75 సెంట్ల పొలంలో టమాటో సాగు చేశాను. నారు నుంచి కాయ వచ్చే వరకు వివిధ దఫాలుగా సుమారు రూ.25 వేలు ఖర్చయింది. మొదటి పంట దిగుబడి తక్కువగా పక్వానికి వచ్చినప్పుడు ధర కొంత మెరుగ్గా ఉంది. చివరి కోతలో దిగుబడి అధికంగా ఉన్నప్పటికీ ధర పతనం కావడంతో పెట్టుబడి కూడా రావడం లేదు.

- కోట వెంకటరావు, టమాటో రైతు, ఆరికతోట



ఎమ్మెల్సీగా గెలిపించండి..

శాసనమండలిలో మీ గొంతునవుతా

ఉపాధ్యాయులను కోరిన పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి



రాజాంలో ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-పూసపాటిరేగ, రాజాం

ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గొంతు వినిపిస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యరి పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శనివారం విజయనగరం జిల్లా పూసపాటిరేగ, రాజాం, శ్రీకాకుళం జిల్లా రణస్థలం, జి.సిగడాం మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. 33ఏళ్లుగా నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన ఆరేళ్ల సర్వీసును వదిలేసి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని, ఒక్క అవకాశం ఇస్తే ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో వినిపిస్తానని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా ఉపాధ్యాయ పోస్టులు, పాఠశాలలు తగ్గిపోయాయని తెలిపారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ పోస్టులను తగ్గిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్ విద్యారంగంపై ప్రభుత్వ తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాట ఫలితంగానే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని అన్నారు. ఈ సందర్భంగా 117 జిఒను పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నంబరు 3ను పునరుద్ధరించడానికి శాసన మండలిలో గొంతెత్తుతానన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడం, 12వ పిఆర్‌సి చైర్మన్‌ను నియమించడం, ఆర్థిక బకాయిలు చెల్లింపు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులను రెగ్యులర్ చేయడం, తదితర డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో జిఒ 114 అమలుకు పని చేస్తానన్నారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడానికి, రెగ్యులర్ చేయడానికి తనవంతు ప్రయత్నిస్తానని తెలిపారు. పెద్దల సభను రాజకీయ సభగా మార్చొద్దు అని, పెద్దల సభకు పోరాటపటిమ కలిగి, విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తిని పంపాలని కోరారు. ప్రచారంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయగౌరిని గెలిపించండి

మెంటాడ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని ఫ్యాప్టో మాజీ చైర్మన్ పి.బాబురెడ్డి కోరారు. మెంటాడ మండలంలో మోడల్ స్కూల్, కెజిబివి, ఉన్నత పాఠశాలలో ఆయన ప్రచారం చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారం కావాలంటే శాసన మండలి ఎన్నికల్లో విజయగౌరి గెలవాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. ప్రచారంలో యుటిఎఫ్‌నాయకులు భాస్కరరావు, పి.రాంప్రసాద్, కె.సత్యనారాయణ, సిహెచ్ రవి, పెంకి రవి, సిఐటియు నాయకులు రాకోటి రాములు, తదితరులు పాల్గొన్నారు.



కోట జంక్షన్‌లో నిరసన చేపడుతున్న గ్రూప్-2 అభ్యర్థులు

కొనసాగిన గ్రూప్-2 అభ్యర్థుల నిరసన

రహదారిపై బైఠాయింపు... పోలీసు స్టేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రోస్టర్ విధానం ప్రకటించకుండా గ్రూప్ 2 పరీక్ష నిర్వహిస్తే ఊరుకునేది లేదని అభ్యర్థులు రెండోరోజు శనివారం కూడా కోట జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. రోస్టర్ సవరించకుండా గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుండటంతో నిరుద్యోగ అభ్యర్థులు ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం రోస్టర్‌ను సవరించకుండా పరీక్ష పెడితే తిరుగుబాటు తప్పదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అభ్యర్థులు రాత్రి వరకు ఆందోళన కొనసాగించారు. వీరికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ మద్దతు తెలిపారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో రహదారిపై బైఠాయించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటర్లకు

27న స్పెషల్ క్యాజువల్ లీవ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు వేయడానికి వీలుగా ఓటు హక్కు ఉన్న వారు తమ ఓటును వినియోగించుకునేందుకు ఈ నెల 27 న స్పెషల్ క్యాజువల్ లీవ్ ను భారత ఎన్నికల సంఘం ప్రకటించిందని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 27న ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు, ఏర్పాట్ల నిమిత్తం ముందు రోజు 26 న కూడా స్థానిక సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు.

పన్నుల వసూలు వేగవంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను వసూళ్ళను వేగవంతం చేయాలని సిబ్బందిని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. పన్నుల వసూలు ప్రక్రియ ఏ విధంగా సాగుతోందన్న విషయమై ఆకస్మిక తనిఖీలు చేశారు. సచివాలయాల పరిధిలో అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పన్ను వసూళ్లను చేపడుతున్నారు. లక్ష్యాలను చేరాలన్న ఉద్దేశంతో కమిషనర్ సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చారు. మొండి బకాయిలను ఉపేక్షించ వద్దని రెడ్ నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైతే విద్యుత్ సరఫరాలను కూడా నిలుపుదల చేయాలని సిబ్బందికి సూచించారు.

జాగ్రత్తలతోనే గుండె జబ్బులు నివారణ

ప్రజాశక్తి-బొబ్బిలి

జాగ్రత్తలతోనే గుండె వ్యాధులను నివారించవచ్చునని ప్రముఖ గుండె వైద్య నిపుణులు గుల్ల సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని టిబిఆర్ ఫంక్షన్ హాల్లో శనివారం ఐఎంఎ ఆధ్వర్యంలో గుండె, కేన్సర్ వ్యాధులు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధుల నివారణకు వ్యాయామం చేసి ఆహార అలవాట్లను మార్చుకోవాలని కోరారు. గుండె వ్యాధులకు అధునాతన పద్ధతిలో ఎలా వైద్యం చేయాలో వివరించారు. సదస్సులో పలు జిల్లాల నుంచి వైద్యులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-భోగాపురం

రైతుల సమక్షంలోనే రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. భోగాపురం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్న రావాడ గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. గ్రౌండ్ ట్రూతింగ్ ను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఎవరి భూమునైతే రీ సర్వే చేపడతారో, ఆ భూమి హక్కు దారులను తప్పనిసరిగా రప్పించి, వారి సమక్షంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ పొలం చుట్టుపక్కల రైతులను కూడా సర్వే నిర్వహిస్తున్నప్పుడు పిలవాలని సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలో లోగా రి సర్వే ప్రక్రియను తప్పులు లేకుండా పూర్తి చేయాలని జెసి స్పష్టం చేశారు. తాహశీల్దార్ సురేష్, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ భగవాన్, ఇతర రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డివిజి

ప్రజాశక్తి-బొబ్బిలి

బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర రావు శనివారం సందర్శించారు. టెన్త్ క్లాస్ స్టడీ మెటీరియల్, వసతి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి సమస్యలను ఆరాతీశారు. ఇంత పెద్ద వసతిగృహానికి వార్డెన్ లేకపోవడం, విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన తెలిపారు.

సబ్ జైల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరంలీగల్




జైల్లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి రాజేష్‌కుమార్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ శనివారం విజయనగరం సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీచేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని, తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని తెలిపారు. ఖైదీల పట్ల వివక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమని తెలిపారు. అనంతరం జైలులో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని భోజనశాలను పరిశీలించారు.

జిల్లా ఆస్పత్రికి మహర్దశ

- రూ.కోటితో అత్యాధునిక పరికరాలు
- కలెక్టర్ అంబేద్కర్‌తో ఎంఒయు కుదుర్చుకున్న ఎన్‌పిసిఐఎల్



ఎంఒయు పత్రాలను మార్చుకుంటున్న కలెక్టర్, ఎన్‌పిసిఐఎల్ ప్రతినిధులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి మహర్దశ పట్టనుంది. సుమారు కోటి రూపాయలతో ఆధునిక పరికరాలను అందించేందుకు కొవ్వాడ ఎన్‌పిసిఐఎల్ (నేషనల్ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్) ముందుకు వచ్చింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో ఆ సంస్థ ప్రతినిధులు శనివారం ఎంఒయు కుదుర్చుకున్నారు. సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి) నిధుల రూపంలో ఈ కోటి రూపాయలను వెచ్చించనున్నారు. ఈ నిధులతో జిజిహెచ్‌లోని ఆపరేషన్ థియేటర్, న్యూరాలజీ, యూరాలజీ, బయో కెమిస్ట్రీ, అనస్థీషియా, ఇఎన్‌టి, జనరల్ సర్జరీ విభాగాలకు వివిధ రకాల పరికరాలు సమకూరుస్తారు. దీనిలో భాగంగా న్యూరో డ్రిల్లింగ్ మిషన్, న్యూరో మైక్రోస్కోప్, న్యూరో సర్జరీ పరికరాలు, యురెత్రోస్కోప్, నెఫ్రోస్కోప్, యూనివర్సిల్ నెఫ్రోస్కోప్, మినీపెర్క్ స్కోప్, లిథో మిషన్, కంప్రెసర్, టెలీస్కోప్, సిస్టోస్కోపీ సెట్, బయో కెమిస్ట్రీ అనలైజర్, డయాథెర్మీ, అనస్థీషియా వర్క్‌స్టేషన్, వీడియో లారింజోస్కోప్ సెట్, ఎం-3 మారథాన్ మైక్రోమీటర్, పేరా మీటర్లు-3 అందించనున్నారు. మార్చి నెలాఖరుకల్లా ఈ పరికరాలను అందించనున్నారు. సిఎస్ఆర్ నిధులతో ఆసుపత్రికి అదనపు వసతులను సమకూర్చడానికి ముందుకు వచ్చిన ఎన్‌పిసిఐఎల్ కు జిల్లా కలెక్టర్ అంబేద్కర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఒ పి.బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎన్‌పిసిఐఎల్ అసోసియేట్ డైరెక్టర్ కెఎస్విబివి ప్రసాద్, అడిషనల్ చీఫ్ ఇంజనీర్ బి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

విద్యాశాఖ ఆర్‌డి విజయ్ భాస్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఎటువంటి అలసత్వానికి తావులేకుండా నిర్వహించాలని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియం లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకరు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులకు కల్లెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ జరిగింది. శిక్షణలో విద్యాశాఖ రీజనల్ డై రెక్టర్ బి. విజయభాస్కర్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షలకు సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.


డిఇఒ యు.మాణిక్యం నాయుడు మాట్లాడుతూ సిఎస్, డిఒ లు, ఎంఇఒ లు పరీక్షా కేంద్రాలలో ఫర్నిచర్, తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె. వెంకటరమణ , ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ టి. సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పెన్నిధా? కూటమి కుతంత్రమా?

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. శాసనమండలిలో ఉపాధ్యాయులకు కేటాయించిన ఎమ్మెల్సీ పదవికి కూడా రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం రాజకీయ రంగు పులిమింది. ఈనేపథ్యంలో ఉపాధ్యాయుల ఓటు వారి సమస్యలపైనా, హక్కుల సాధనపైనా పోరుబాట పడుతున్న ఉద్యమ గళానికా? కూటమి ప్రభుత్వం పన్నుతున్న కుతంత్రాలకా? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

మేధావులకు శాసన మండలిలో కేటాయించిన ఎమ్మెల్సీ పదవిని ఉపయోగించుకుని, ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలపై గళం వినిపించుకోవాలని ఉపాధ్యాయులు భావిస్తుండగా, ఆ గళానికి కళ్లెం వేసి సమస్యలు వినబడనీయకుండా చేయాలని రాష్ట్రంలో అధికారం చలాయిస్తున్న టిడిపి భావిస్తోంది. కానీ, ఇది అంత ఆషామాషీ కాదు. ఎందుకంటే మాస్టార్లను మోసం చేసి, ఓట్లు దండేయడం అంత సులువు కాదు. ఎంతైనా మేధావులు కదా! ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో మొత్తం 10 మంది అభ్యర్థులు ఉన్నారు. ప్రధానంగా యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు తరపున మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసునాయుడు మధ్య త్రిముఖపోటీ నెలకొంది. రఘువర్మకు టిడిపి మద్దతు ప్రకటించింది. ఈలెక్కన ఉపాధ్యాయులు - టిడిపి మధ్యే పోటీ ఉన్నట్టుగా ఉపాధ్యాయులు భావిస్తున్నారు. రాజకీయ పార్టీలకు అందులోనూ అధికార పార్టీలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో భాగమైనవారు ఉపాధ్యాయ సంఘాల నాయకులైనా న్యాయం చేయలేరు. అధికార పార్టీ మద్ధతుతో గెలిచిన తరువాత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపడం లేదా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం అంత సులువు కాదు. అందుకే శాసన మండలిలో ఉపాధ్యాయుల కోసం రాజ్యాంగం కొన్ని సీట్లను కేటాయించింది. కానీ, ఇందులోనూ అధికార పార్టీ దూరిపోయి రాజకీయం చేయడం మొదలెట్టింది.



ఊరకనే రారు మహానుభావులు అన్నట్టుగా... ఊరకనే ఊసిపోక రఘువర్మకు టిడిపి మద్ధతు ఇచ్చిందనుకుంటే పొరపాటే. ఉపాధ్యాయులు తమ సమస్యలపై నిర్భయంగా, నికరంగా పోరాడుతున్నారు. ఇటువంటి పోరాటాలకు ఉత్తరాంధ్ర పురిటిగడ్డ వంటిది. పీడిత ప్రజల కోసం తమ ఉద్యోగాలను సైతం వదిలేసి శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం నడిపిన చరిత్ర ఉంది. అటువంటి స్ఫూర్తితోనే ఉపాధ్యాయులు తమ సమస్యలపై పోరాడుతున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులు పోరాటంతో 117 జీవోను రద్దు చేసినప్పటికీ, క్లస్టర్ స్కూళ్ల పేరుతో ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వం విలీనం చేస్తూ అవే విధానాలు అమలు చేస్తోంది. సిపిఎస్ విధానం రద్దుచేసి, ఉద్యోగులకు అనుకూలంగా ప్రత్యామ్నాయ పాలసీ అమలు చేస్తామని చెప్పినప్పటికీ ప్రస్తుతం ప్రభుత్వం నోరు మెదపడం లేదు. పిఆర్‌సి, డిఎ ఎరియర్స్ బకాయి 24వేల కోట్ల వరకు ఉంది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో 20శాతం చెల్లిస్తామని చెప్పినప్పటికీ మాట నిలబెట్టుకోలేదు. కొత్త పిఆర్‌సి కమిషన్‌ను వేయలేదు సరికదా ఐఆర్‌సి ప్రకటనే లేకుండా పోయింది. ఈనేపథ్యంలో ఉపాధ్యాయులు తమ ఆర్థిక అంశాలతో పాటు రేషనలైజేషన్‌లో భాగంగా స్కూళ్ల కుదింపు, ఉపాధ్యాయ పోస్టుల ఎత్తివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈనేపథ్యంలో ఈ సమస్యలన్నీ శాసనమండలిలో చర్చకు వచ్చేందుకు వీలు లేకుండా ఉపాధ్యాయుల గొంతు నొక్కేందుకు తమ కనుసన్నల్లో ఉన్న రఘువర్మకు టిడిపి మద్దతు ప్రకటించింది.

మరోవైపు ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి సుమారు 33ఏళ్లగా యుటిఎఫ్ నాయకురాలిగా ఉపాధ్యాయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ వారి సమస్యలపైనా, విద్యారంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు చేపట్టారు. ఎన్నో విజయాలు సాధించారు. ఇందుకోసం ఎన్నో నిర్బంధాలు, బెదిరింపులు, అక్రమ కేసులు ఎదుర్కొన్నారు. ఇటువంటి నేత మండలిలో అడుగుపెడితే సర్కారు ఎదుర్కోవడం అంత సులువు కాదు. ఇప్పటికే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మండలిలో లేవనెత్తిన ప్రశ్నలకు సర్కారు ఉక్కిరి బిక్కిరి అవుతోంది. ఈనేపథ్యంలో పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న విజయగౌరిని మండలికి రానిస్తే ఇబ్బందులు తప్పవనేది టిడిపి భయం. అందుకే ఆ పార్టీ ఆదేశాల మేరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు తమ నియోజకవర్గాల్లోని స్కూళ్లకు వెళ్లిమరీ ఉపాధ్యాయులను బతిమాలడం, బెదిరించడం వంటివాటికి పాల్పడుతున్నారు. అయినా సరే... ఉపాధ్యాయుల ముందు టిడిపి పాచిక పారే పరిస్థితి కనిపించడం లేదు. అనేక రూపాల్లో తమకు అన్యాయం చేయడమే కాకుండా, తమ హక్కులకే భంగం కలిగిస్తున్న పాలకపార్టీలకు తామెందుకు ఓట్లు వేయాలి? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే టిడిపి మద్ధతు ద్వారా మండలికి వెళ్లిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట నిలబెట్టుకోలేదు. దీంతో, నిరుద్యోగులంతా కలిసి చిరంజీవులు డౌన్ డౌన్ అంటూ రాజీనామా చేయాలని పట్టుబడుతూ ఆందోళనలు చేస్తున్నారు. ఉపాధ్యాయులమై ఉండీ మోసం పోతే, ఆ తరువాత ఎవరికి చెప్పుకుంటాం అంటూ గురువుల్లో చర్చనడుస్తోంది. ఈనేపథ్యంలో గెలుపు తీరానికి దగ్గరగావున్న విజయగౌరి వైపు సానుకూల దృక్పదంతో గురువుల నడక కనిపిస్తోంది.

పక్కాగా జాతర ఏర్పాట్లు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-చీపురుపల్లి

మార్చి 2,3,4వ తేదీలలో జరగనున్న కనకమహలక్ష్మి అమ్మవారి 27వ జాతర మహోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పక్కాగా జరగాలని ఆర్‌డిఒ జి.సత్యవాణి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రధానంగా శానిటేషన్, పోలీసు బందోబస్తు, అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖలకు సంబందించిన అధికారులందరూ జాతర జరిగిన అన్నిరోజులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయ ఇఒ బి శ్రీనివాసరావు, సిఐ జి.శంకరరావు, పంచాయతీ ఇఒ ఝాన్సీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల వైద్య సేవలు ప్రారంభం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మాజీ మంత్రి కీర్తిశేషులు పెనుమత్స సాంబశివరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ప్రముఖ ఆర్థోపెడిషన్ అక్కేన శ్రీరామ్మూర్తి నేతృత్వంలో మొయిద గ్రామంలో శనివారం వంద రోజుల ఉచిత వైద్య సేవలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 22 నుంచి జూన్ 1 వరకూ ఉచిత వైద్య సేవలు గ్రామ సచివాలయం వద్ద అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్కేనా శ్రీరామ్ మూర్తి, సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలిపల్లి కాలువ పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చెరుకుపల్లి వద్దనున్న పోలిపల్లి కాలువను నీటిపారుదల శాఖ ఎఇ ఎం.రమేష్‌చంద్ర శనివారం పరిశీలించారు. ఈ కాలువపై చెరుకుపల్లి వద్ద వివిధ గ్రామాలకు వెళ్లే విధంగా చెక్ డ్యామ్ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. దీంతో ఈ కాలువను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిధులు లేదా దివిస్ కంపెనీకి చెందిన సిఎస్‌ఆర్ నిధులతో చేయాలని గ్రామ పెద్దలు సరగడ తోగులు రెడ్డి, టి.గురుమూర్తి, ఆర్ దుర్గారావు తదితరులు కోరారు. దీనిపై స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

స్కౌట్స్, గైడ్స్ ర్యాలీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పునశ్చరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్, గైడ్స్ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. బేసిక్ స్కౌట్ మాస్టర్ పి.రమేష్ నాయుడు పర్యవేక్షణలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, ఉపాధ్యాయ సిబ్బంది రవిశంకర్, జగన్నాథం, గౌరి, శ్రీనివాసరావు, గోవింద, భవాని, సన్యాసిరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ శనివారం కొనసాగింది. ఈ శిక్షణను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. అంగన్వాడీలు గ్రూపుల వారీగా తయారు చేస్తున్న టిఎల్‌ఎంను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, ఆర్‌పిలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టాలని ఎస్ఐ ప్రసాదరావు.. ఎంఎస్‌పిలను ఆదేశించారు. స్థానిక పోలీసుస్టేషన్లో శనివారం ఎంఎస్‌పిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం బెల్టుషాపులు, గంజాయి రవాణా, మాదక ద్రవ్య వినియోగంపై నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా మహిళలను వేధించిన వారిపై, భార్యాభర్తల దాంపత్య జీవితంలో వచ్చే గొడవలపై కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బొబ్బిలి : మున్సిపాలిటీలోని అప్పయ్యపేటలో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి ఎమ్మెల్యే బేబినాయన రూ.3 లక్షలు విరాళంగా ఇచ్చారు. కోటలో శనివారం చెక్కును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

కెజిబివిని సందర్శించిన జిసిడిఒ

నెల్లిమర్ల : స్థానిక కెజిబివి విద్యాలయాన్ని బాలిక శిశు అభివృద్ధి అధికారి మాలతి శనివారం సందర్శించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు పబ్లిక్ పరీక్షలు దృష్ట్యా సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఉమ, ఉపాధ్యాయ, ఉపాధ్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- రాజాం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం శ్రీకాకుళం జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని దాస్త్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. గారా చీపురుపల్లి గ్రామ పంచాయతీనీ సందర్శించి సిపిడబ్ల్యుఎస్ పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగు నీటిని పరిక్షించి, కార్యాలయం ఆవరణంలో నూతనంగా సందర్శకులు కోసం నిర్మిస్తున్న టాయిలెట్లను, కార్యాలయం పక్కన ఉన్న మున్సిపల్ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న సన్యాసిరావు

5 వేల మంది విద్యార్థులకు పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి -చీపురుపల్లి

చీపురుపల్లి మండలంలో గల ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న సుమారు 5వేల మంది విద్యార్థులకు కెల్లపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు కె.సన్యాసిరావు పెన్నులు పంపిణీ చేశారు. చీపురుపల్లి మండలంలో గల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, మెట్టపల్లి, కర్లాం, పెదనడిపల్లి ఉన్నత పాఠశాలలు, రామాంజనేయ కాలనీ ఉన్నత పాఠశాలలతో పాటు అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు 35 వేల రూపాయలు విలువచేసే పెన్నులను సన్యాసిరావు మాస్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి కెవిఆర్ ఆంజనేయులు జ్ఞాపకార్థం విద్యార్థులకు పెన్నులు అందజేసినట్లు తెలిపారు.

రైతు ఘటనపై విచారణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

చనుమల్లు పేట గ్రామానికి చెందిన చనుమల్లు అబద్ధం అనే రైతు మ్యుటేషన్ కోసం రెవిన్యూ అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారని ఆవేదన చెందుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నం చేసుకున్న నేపథ్యంలో గుషిణి విఆర్ఒ పై తహశీల్దారు శనివారం విచారణ చేపట్టారు. రైతు అబద్ధం భూములు సాగు చేస్తున్నారని, ఎటువంటి రిజిస్టర్ డాక్యుమెంట్ లేవని తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేసి పై అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఈ నెల 27న నిర్వహించబోవు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికలను సజావుగా, ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరం పట్టణంలోని ప్రభుత్వ సంగీత కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రాన్ని శనివారం ఎస్‌పి సందర్శించారు. పోలింగు కేంద్రంలో ఉన్న పోలింగు స్టేషన్ గదులను పరిశీలించి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, సిసి కెమెరాలు అన్ని సక్రమంగా పనిచేసేలా చూడాలని పోలీసు, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. క్యూ లైన్లు సక్రమంగా ఏర్పాటు చేసుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగు రోజు పోలింగ్ అధికారులు, సిబ్బంది, ఓటర్ల వాహనాలు పార్కింగ్ చేసుకొనేందుకు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఎస్‌పి వెంట 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఎ.వి.లీలారావు, ట్రాఫిక్ సిఐ సూరినాయుడు, రెవిన్యూ అధికారులు, ఎస్ఐలు రామగణేష్, ఎస్.రవి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్‌డిఒ రామ్మోహనరావు, డిఎస్‌ఒ కె.మధుసూదనరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ఇబ్బందులు పడకుండా చూడాలని తహశీల్దార్ ఎం.శ్రీనును ఆదేశించారు. శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని డిఎస్‌ఒ మధుసూదనరావు తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలను తహసీల్దార్ ఎం.శ్రీనును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిటి గౌరీశంకర్, సిఐ కె.సతీష్ కుమార్, తదితరులున్నారు.

వేపాడ : వల్లంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సెక్టార్ అధికారి పి.శ్రీచరణ్ పరిశీలించారు. ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారుతహశీల్దార్ జె.రాములమ్మ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నెల్లిమర్ల బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఎలక్షన్ సెక్టార్ ఆఫీసర్, హార్ట్ కల్చర్ డిడి జమదగ్ని పరిశీలించారు. ఓటర్లు ఓటు వేయటానికి అనువైన ఏర్పాటు గూర్చి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహశీల్దారు పి. సుదర్శన రావు, ఎస్ఐ బి. గణేష్, రూట్ ఆఫీసర్ ఇమ్రాన్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ వివి ఆర్ జగన్నాధరావు, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నారు.





విజయనగరం లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్ ; బొబ్బిలిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

అధికారులు అందుబాటులో ఉండాలి : ఎంపిపి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాల్లో మండలస్థాయి అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు ఎంపిటిసిలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దన్నానపేట, రామతీర్థం ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలను అక్రమంగా తొలగించారని సర్పంచులు గేదెల రామచిరంజీవి, కంచరావు సూర్యకళ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల రెవెన్యూ సర్వేయర్ అందుబాటులో ఉండడం లేదని, ఫోన్‌కు కూడా స్పందించడం లేదని దీంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని సర్పంచ్ ఎంపిపి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా అభివృద్ధి పనులు కొనసాగుతుండడంపై మరికొంత మంది ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదింపుపై ప్రశ్నించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రైతుల పార్మర్ రిజిస్ట్రేషన్లు పూర్తిస్థాయిలో జరిగేటట్లు చూడాలన్నారు. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ, జీబీఎస్ వ్యాధుల వల్ల ప్రజల్లో ఆందోళన నెలకొందని, వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాలన్నారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు, ఇఒపిఆర్‌డి శంకర జగన్నాదం, ఎఒ సుదర్శనం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

పూసపాటిరేగ: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని పతివాడ ఎంపిటిసి పతివాడ అప్పలనాయుడు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మహంతి కళ్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం. రాధిక మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందును ఎటువంటి తీర్మాణాలు చేయకూడదన్నారు. సభ్యులు ఏదైనా అత్యవసర సమస్య అయితే లేవనెత్తాలన్నారు. దాంతో చింతపల్లి ఎంపిటిసి బర్రి తాత, వైస్ ఎంపిపి ఎన్ సత్యనారాయణ రాజు తాగునీటి సమస్యలు ఉన్నాయంటూ చెప్పారు. దానికి స్పందించిన జెఇ పోరాంలో ఇంటింటి కుళాయి సమస్యను గుర్తించామన్నారు. దాన్ని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పతివాడ ఎంపిటిసి పతివాడ అప్పలనాయుడు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. అనంతరం స్థానిక పశువైద్యాధికారి ఈశ్వర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల బర్డ్‌ఫ్లూ మీద ప్రజల్లో అపోహలు ఉన్నాయన్నారు. మన జిల్లాలో, మండలంలోగాని ఎటువంటి వ్యాధి లేదన్నారు. చికెన్ 100 డిగ్రీలు వేడిలో వండి తినొచ్చన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి అల్లాడ సత్యనారాయణ మూర్తి, సర్పంచులు టొంపల సీతారాం, డి. గణేష్, రౌతు స్వామినాయుడు, రౌతు శ్రీరాంమూర్తి, తహశీల్దార్ టి.గోవిందతో వివిద శాఖల అధికార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సుధారాణి



విజేతగా నిలిచిన ఎస్.కోట జట్టు

వాలీబాల్ పోటీలో విజేత శృంగవరపుకోట

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని భారతి డిఫెన్స్ అకాడమీ ఆవరణలో శారదా పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో శృంగవరపుకోట జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా పార్వతీపురం, మూడో స్థానంలో కురుపాం, నాలుగో స్థానంలో విజయనగరం జట్లు నిలిచాయి. వీరికి నగదు బహుమతులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అందజేశారు. విజేతకు రూ.1.25 లక్షలు, రన్నర్‌కు రూ.60 వేలు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.30 వేలు, రూ.25 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో శారదా పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ప్రభాస్ మోహన్, సలహాదారు మూర్తి, పర్చేజ్ అండ్ సోర్స్ జిఎం అలోక్ చౌదరి, హెచ్‌ఆర్ డిజిఎం సన్యాసిరావు, హెచ్‌ఆర్ అసిస్టెంట్ మేనేజర్ శంకర్రావు, సంతోష్, వాలీబాల్ కోచ్ గవర సూరిబాబు, కె.కృష్ణంరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రతి ఒక్కరూ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని కొల్లాయివలసకు చెందిన క్రీడాకారిణి పైడి వసంతకు జనసేన నేత వందనాల అప్పలరాజు రూ. 27 వేలు విలువైన షూషను ఎమ్మెల్యే సమక్షంలో శనివారం అందించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే అప్పలరాజును అభినందించారు. క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వడం మంచిదన్నారు. అప్పలరాజు మాట్లాడుతూ వసంత జిల్లా స్థాయి దాటుకొని రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో మంచి ప్రతిభ కనబరిచిందన్నారు. అవసరమైన షుస్ ఉంటే మరింత నైపుణ్యం ప్రదర్శిస్తుందన్న ఉద్దేశంతో పాటు క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశం ఈ సాయం అందించామన్నారు. భవిష్యత్తులో మరింత నైపుణ్యంతో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు వార్డు మెంబర్ కొంగరాపు శ్రీను, జనసైనికులు గుమ్మడి పైడిరాజు, మండల నాయకులు జమరాజు, ఇజ్జురౌతు ఈశ్వరావు, శ్రీనువాసరావు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

వల్లంపూడి పంచాయతీలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేసి క్లాప్‌మిత్రలకు అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం : గ్రామాల్లో అపారిశుధ్య నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఇఒపిఆర్‌డి వెంకటరమణ కోరారు. శని, ఆదివారాల్లో తడి, పొడి చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శనివారం చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కార్యక్రమంలో నాయుడువలస పంచాయతీ కార్యదర్శి అడపా ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించండి : ఎపిసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాభివృద్ధికి సహకరించాలని ఎంఇఒలను ఎపిసి ఎ.రామారావు కోరారు. శనివారం సమగ్ర శిక్షా కార్యాలయంలో మండలాల విద్యాశాఖాకారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సమగ్రశిక్షా ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న వివిధ ప్రోగ్రాముల పై అవగాహన కల్పించి, తగిన సూచనలు, సలహాలను అందించారు. జిల్లాలో సమగ్ర శిక్ష అమలవుతున్న కార్యక్రమాలు పాఠశాల స్థాయిలో అమలు జరుగేటట్లు చూడాలన్నారు. సెక్టోరియల్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మస్తర్లలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-రామభద్రపురం

ఉపాధి హామీ పనుల మస్తర్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎపిఒ త్రినాథరావు హెచ్చరించారు. మండలంలోని నాయుడువలసలో శనివారం ఉపాధి పనులు పరిశీలించి, మస్తర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు రానివారికి మస్తర్లు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం రింగ్ ట్రెంచ్లు పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ప్రతి వేతనదారుడికి రూ.300 వచ్చేలా రెండు పూటలా పనులు కల్పించాలని సూచించారు.

కమిషనర్ వద్ద సమస్యలపై ఏకరువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య 26వ డివిజన్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. సాధ్యమైనవి వెనువెంటనే పరిష్కరించేందుకు సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చారు. కోరాడ వీధి, ఎంఆర్ కాలేజ్, గురజాడ అప్పారావు రోడ్, మూడు లంతర్లు తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారులకు అడ్డంకిగా ఉన్న వాటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే తమ వీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని వాటి బారిన పడి కొంతమంది గాయాలపాలు అయ్యారని స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. వెంటనే కుక్కలను అదుపులోకి తీసుకొని యాంటీ ర్యాబిస్ టీకాలను వేయించాలని, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయించాలని సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు.

తాత్కాలిక నిర్మాణాలు తొలగించిన నగర పాలక సిబ్బంది

కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు గురజాడ అప్పారావు రోడ్ లో రహదారులను ఆక్రమించి చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలను సిబ్బంది తొలగించి వేశారు. అలాగే పోస్టర్లు, ఫ్లెక్సీలను ఎక్కడికక్కడ తొలగించారు.

గజజ్యోతి వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో గజజ్యోతి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి లాంఛనంగా జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకలలో విద్యార్థులు ఆనందాన్ని పంచుకోవాలే తప్ప ఎవరు హద్దులు మీరవద్దని హితవు పలికారు. ప్రముఖ సినీ విమర్శకులు, రచయిత రామ్ వెంకట శ్రీకర్ రెడ్డి తొలిరోజు వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెక్నికల్ సెషన్లో భాగంగా డ్రోన్లు ప్రదర్శన, ఆటోమేటెడ్ వాటర్ లెవెల్ ఇండికేటర్ అండ్ మోటార్ కంట్రోలర్, ఎఆర్ విఆర్, స్మార్ట్ ఇరిగేషన్ తదితర ప్రాజెక్టులను ప్రదర్శించారు. వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు వీటిని తిలకించారు. ప్రముఖ సినీ గాయకులు రేవంత్ ఆదివారం సాయంత్రం జరిగే ముగింపు వేడుకలలో పాల్గొంటారని విసి తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ అండ్ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, డీన్ డాక్టర్ సన్నీ డయాల్, డాక్టర్ విజయ్‌బాబు, ఐక్యూఎసి హెడ్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ పుష్పలత, డీన్ డాక్టర్ అనీల్ కుమార్, సిఎస్ఆర్ కోఆర్డినేటర్లు శ్రావణి, ఆలనా, జోగినాయుడు పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాబోయే బడ్జెట్ సమావేశాల్లో పంట ఉత్పత్తుల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు.. ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఉత్పత్తి చేసిన పంటలకు సరైన ధరలు లేక అల్లాడిపోతున్నారని ఆవేదన చెందారు. జిల్లాలో దాదాపు 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అటు మిల్లుల్లోనూ, ఇటు కళ్లాల్లోనూ ఉండిపోయి ఏం చేయాలో పాలుపోక రైతులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుందని దుయ్యబట్టారు. మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఏడుపు తప్ప మరేమీ సంక్షేమం లేదని సర్కారుపై విరుచుకుపడ్డారు. గతంలో వ్యవసాయం దండగన్న చంద్రబాబునాయుడు అప్పటి మాటకే కట్టుబడి, ఆయన విధానాలను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, బి.సత్యనారాయణ, బి.విశ్వనాథశర్మ, తెంటు సత్యంనాయుడు పాల్గొన్నారు.

సిటియు, ఎంఆర్ కళాశాల ఎంఒయు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంతో ఎంఆర్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పరిశోధన, విజ్ఞాన మార్పిడి, నైపుణ్య మార్పిడి, ఇంటర్న్‌షిప్‌లు, విద్య, విద్యార్థులు ఉద్యోగం పొందే విధంగా ఉపాధి నైపుణ్యాలు అందించే విధంగా ఈ ఒప్పందం ఉపయోగపడుతుంది. ఈ సంధర్భంగా జరిగిన ఎంఒయులో ఒప్పంద పత్రాలను ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సాంబశివరావు, సిటియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ మార్చుకున్నారు. ఒప్పంద కార్యక్రమంలో డీన్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ జితంత్ర మోహన్ మిగ్రి, పరిపాలనా విభాగాధికారి ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్ సూర్యనారాయణ, ఎంఆర్ కళాశాల ఎస్టాబ్లిష్‌మెంట్ అక్రిడేషన్ కన్వీనర్ డాక్టర్ పి.గణపతిరావు పాల్గొన్నారు.

నిజమైన సంపద సృష్టి మాతోనే సాధ్యం

ప్రజాశక్తి - వంగర

సెకి విద్యుత్ ఒప్పందంపై ఎఆర్ఆర్ నివేదిక జగన్ పరిపాలనకు మచ్చుతునక అని 7వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందం చారిత్రాత్మకమని నిజమైన సంపద సృష్టి జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని ఇరువాడలో శనివారం జరిగిన రామ మందిరం ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ ఒప్పందంపై ఎఆర్ఆర్ ఇచ్చిన తీర్పు జగన్ పరిపాలన తీరుకు అద్దం పట్టిందన్నారు. శక్తి ఒప్పందంపై లేనిపోని అపోహలు, కట్టుకథలు కల్పించారనే వాస్తవం ఈ నివేదికతో రుజువైందన్నారు. పరిపాలన చేతకాక గత ప్రభుత్వంపై ప్రతి తప్పును నెట్టివేయాలన్న కూటమి ప్రభుత్వం కుట్రలో ఇది ఒక భాగమని ఆయన తెలిపారు. అంతకుముందు ఆయన ఇరువాడలో కొత్తగా నిర్మించిన రామ మందిరాన్ని సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శనరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బిసిల హక్కుల కోసం 12,13న చలో ఢిల్లీ

ప్రజాశకి-విజయనగరం టౌన్

బిసిల హక్కుల సాధనకు మార్చి 12,13 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నడిపేన శశి భార్గవి, ఉత్తరాంధ్ర అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం జమ్ము లో వారి నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పాలకుల హయాంలో బిసి కార్పొరేషన్ పదవులు ఇచ్చి నిధులు ఇవ్వకుండా సంక్షేమం విస్మరించారని పేర్కొన్నారు. రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా మరింత అభివద్ధి చెందడానికి బిసి మహిళలకు రాజకీయాల్లో రిజర్వేషన్లు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఏయే బిసి సామాజిక వర్గాలు ఎంత శాతం మంది ఉన్నారో సరైన గణాంకాలు లేవని, వాటిని సాధించడానికి అవసరమైన పోరాటం చేస్తామని చెప్పారు. ఇందుకోసం మార్చి లో 12,13 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు కోరాడ రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఆల్తి వీరు వెంకట సత్యనారాయణ, ఆల్తి చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో హెల్త్ సెంటర్ వద్ద, భరతవాని పాలెంలో శనివారం వంద రోజుల టిబి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టిబి వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లక్ష్యాలను న్యూహోప్ డిప్యూటీ సెక్రటరీ అషిమ భట్నాగర్, ఎన్యూహెచ్‌ఎం ఎంహెచ్‌ఎఫ్‌డబ్ల్యు కన్సల్టెంట్ నిహాసాటియా, డబ్ల్యుహెచ్‌ఒ కన్సల్టెంట్ ప్రియాంక, డిఎల్‌టిఒ కె.రాణి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి, సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ నాయకులు బుద్ధ అప్పలనాయుడు, జిల్లా టిబి సూపర్వైజర్ నాగరాజు, సిహెచ్‌ఒ ఎస్.ఆంజనేయులు, ఎస్.రమ్య, ఎఎన్ఎం బి.లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సాయిబాబా రెడ్డి, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న న్యూహోప్ డిప్యూటీ సెక్రటరీ అషిమ భట్నాగర్

వేపాడ సింగరాయి గ్రామంలో టిబి నివారణకు కృషి చేస్తామని వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. వంద రోజుల టిబి వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రతిజ్ఞ చేశారు.

టిడిపిలో ఇద్దరు సర్పంచులు చేరిక

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని రాగోలు, ఎస్ఎస్ఆర్ పేట సర్పంచులు చందక బంగారునాయుడు, వసంత వీరమ్మ శనివారం టిడిపిలో చేరారు. టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కళా వెంకటరావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచులతోపాటు రెండు గ్రామాలకు చెందిన వంద కుటుంబాలు, వార్డు మెంబర్లు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ కలసి పని చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మాల్లిక్ నాయుడు, జనసేన నాయకులు శ్రీనివాసరావు, వెన్ని సన్యాసి నాయుడు, తిరుముల రాజు కిరణ్ కుమార్, జి.రాము నాయుడు, పిల్ల అప్పలనాయుడు, కనిమేరక కృష్ణ పాల్గొన్నారు.